క్లుప్తంగా

పటిష్టంగా చెక్‌పోస్టుల నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన క్రైం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత పదార్థాల కట్టడిలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. వ్యక్తుల బైండోవర్‌పై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎన్నికల సంబంధిత పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్షించారు. ఆయుధాల డిపాజిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై తగిన శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారులతో పాటు డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

50వ సారి రక్తదానం



చిరంజీవిరెడ్డిని అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ మాజీ అధ్యక్షులు చిరంజీవిరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా రోటరీ క్లబ్‌లో గురువారం 50వ సారి రక్తదానం చేశారు. ఆయనతో పాటు మరో 25 మంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. చిరంజీవి రెడ్డిని పలువురు అభినందించారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, క్లబ్ సభ్యులు టీవీ బాలకృష్ణ, కర్రి బుచ్చిరెడ్డి, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



పదవీ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ముగ్గురు సిబ్బంది పదవీ విరమణ చేశారు. వీరిలో ఒకరు డ్రైవర్, ఇద్దరు కండక్టర్లుగా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన కేజేఎస్ రత్నం, ఎస్.కిశోర్, ఎం చక్రంలను డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, సూపరింటెండెంట్ డి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మా స్థలాన్ని అప్పగించండి

కాకినాడ సిటీ: కాకినాడ శివారు మహాలక్ష్మీనగర్ ప్రాంతంలో ఉన్న ఆకుల గోపయ్య ఎడ్యుకేషన్ ట్రస్టుకు సంబంధించిన ఎనిమిది ఎకరాల 85 సెంట్ల భూమిని సర్వే చేసి తమకు అందించాలని స్థల హక్కుదారుడు ఆకుల నరేష్ వేడుకున్నారు. సుమారు 15 ఏళ్ల నుంచి ఈ స్థలం కాకినాడకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి వనమాడి కొండబాబు బంధువులు తమదే అంటూ ఇబ్బంది పెడుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేదన్నారు. తక్షణమే తమ స్థలాన్ని సర్వే చేసి అప్పగించాలని విలేకర్ల సమావేశంలో గురువారం సాయంత్రం అధికారులను కోరారు. గురువారం మహాలక్ష్మీనగర్ ట్రస్ట్ ప్రాంగణం వద్ద సర్వే చేస్తామంటూ నగర గ్రామీణ ప్రాంతాలకు చెందిన రెవెన్యూ అధికారులు వచ్చినా వారు సర్వే చేయకుండా ఎవరెవరుతోనో ఫోన్లో మాట్లాడి మెల్లగా జారుకున్నారని నరేష్ వివరించారు. తక్షణమే అధికారులు సర్వే చేసి స్థలాన్ని అప్పగించాలని కోరారు. తమకు చెందిన సర్వే స్థలం నంబర్లలో ఎటువంటి ఇబ్బందులూ లేకున్నా అవతలి వ్యక్తులు కావాలని వివాదం సృష్టిస్తున్నట్లు నరేష్ తెలిపారు. స్థలం వద్ద వివాదం లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ద్రవిడ అధ్యయన ఉత్సవాలు



సర్పవరంలో పల్లకిలో ఊరేగుతున్న భావనారాయణ స్వామి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకుని ద్రవిడ అధ్యయన ఉత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. తొమ్మిదో తేదీ వరకు జరగనున్న ఉత్సవాలలో భాగంగా తొలి రోజు స్వామి వారిని పల్లకీలో గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు, ఈఓ భీమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎప్పాస్ బేరం అనుకున్నారా?

- ముందస్తుగానే సొమ్ములు చెల్లిస్తున్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు
- నిర్దేశిత ప్రాంతాల్లో బస్సులు నిలపకపోవడంతో విద్యార్థుల అవస్థలు
- విద్యార్థుల భద్రతలో ఆర్టీసీ బాధ్యతగా ఉండాలి
- పాఠశాలల వేళల్లో సర్వీసులు పెంచాలి



పీఆర్ కళాశాల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



లిఫ్ట్ కోసం జేఎన్‌టీయూకే గేటు వద్ద వేచి చూస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లకి నచ్చని ఒకే ఒక్క పదం పాస్. ఎవరైనా ప్రయాణికుడిని టికెట్ అని అడగ్గానే అటు నుంచి పాస్ అనే జవాబు వస్తే కండక్టర్ ముఖంలో రంగులు మారిపోతాయి. తన టిక్కెట్ల విక్రయం నుంచి కొంత కలెక్షన్ తగ్గిపోతుందనో.. లేక ఇంత టార్గెట్ అని వారికి ఏమైనా ఉంటుందో తెలీదు కానీ దాదాపు అందరు కండక్టర్ల వ్యవహార శైలి ఇదే తీరుగా ఉంటుంది. పాస్ హోల్డర్లు ఏకమొత్తంగా చెల్లించే డబ్బు సంస్థ అభివృద్ధికి, నిర్వహణకే తమ యాజమాన్యాలు వెచ్చిస్తున్నాయన్న విషయాన్ని ఆయా కండక్టర్లు, డ్రైవర్లు విస్మరించడం నిజంగా శోచనీయం. మరో వైపు చూస్తే విద్యార్థులు నిజానికి చిన్న పిల్లలు. ఆ వయసులో కాకపోతే ఇంకెప్పుడు చేస్తారు అల్లరి. వారి అల్లరిని భరించలేము. గోలగోల అనుకుంటే ఎలా? వారిలో డ్రైవర్లు, కండక్టర్ల పిల్లలు కూడా ఉంటారన్న విషయాన్ని విస్మరించకూడదు కదా? విద్యార్థుల పాస్‌లను యాజమాన్యం అప్పనంగా ఇచ్చేస్తున్నట్టు ఫీలైపోతే ఎలా? వారు ఎప్పాసు బేరం కాదని గుర్తించాలి. వారంతా ముందే కట్టేస్తున్న సొమ్ములకు కృతజ్ఞతా భావంతో వారికి తమ సేవల ద్వారా బాధ్యతతో ప్రయాణాల్లో, రాకపోకల్లో భాగం కల్పించాలి. విద్యార్థులు ఉన్నచోట ఆపకుండా మరెక్కడో ఆపితే సీటు కోసం వారు పరుగులెడితే.. ఫుట్‌బోర్డుపై వేలాడితే పడిపోతారే మోనన్న కనీస ఆలోచనతో వారికి సేవలు అందించాలి. జరగరానిది జరిగితే చేసేదేమీ ఉండదు. డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థులపై కనీస వాత్సల్యం ప్రదర్శించాలి.

నెలవారీ, త్రైమాసిక, అర్ధ సంవత్సర ప్రాతిపదికన విద్యార్థుల నుంచి బస్ పాసులు వసూలు చేస్తున్నా వారిని బస్సుల్లో ఎక్కించుకోవడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వారు ఏం చేయాలో తెలియక అటు కళాశాలకు, ఇటు ఇంటికి చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం కాకినాడలో ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిగ్రీలకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు దాదాపు 50 వరకూ ఉన్నాయి. ఈ కళాశాలల్లో విద్యను అభ్యసించడానికి సమీప ప్రాంతాలైన పిఠాపురం, కత్తిపూడి, సామర్లకోట, అనపర్తి, రామచంద్రపురం, కాజులూరు వంటి ప్రాంతాల నుంచి విద్యార్థులు ఆర్టీసీ బస్సులపై ప్రయాణిస్తుంటారు. సామర్లకోట వైపు వేళ్లే వారు ఇంద్రపాలెం బ్రిడ్జి, పిఠాపురం నుండి వేళ్లే వారు భానుగుడి తదితర ప్రాంతాల్లో బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. అయితే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు మాత్రం విద్యార్థులు గుంపుగా ఉన్న ప్రాంతాల్లో ఆపకుండా ప్యాసింజర్లు అధికంగా ఉన్న చోట ఆపడంతో విద్యార్థులు బస్సు ఎక్కడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే విద్యార్థుల రాకపోకలు ఉంటాయి. సామాన్య ప్రయాణికులు, విద్యార్థులు ఉంటారన్న అంచనాతో ఆ సమయాల్లో ప్రత్యేక బస్సులు వేయకపోగా నిరంతరం నడిచే సర్వీసులనే నడుపుతూ విద్యార్థులను ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోంది. కాంప్లెక్స్‌కు వెళ్లి ఎక్కువదామంటే ఆటో ఎక్కిదిగితే పది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో విద్యార్థులు నరకయాతన పడుతూ ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నారు. అబ్బాయిలైతే ఏవరో ఒకరు బైక్ లిఫ్ట్ అడిగి కాంప్లెక్స్‌కు చేరుకుంటున్నారు. అమ్మాయిలు ఏ సమయమైనా బస్సు వచ్చే వరకూ ఆగి వారు ఎక్కించుకుంటేనే ప్రయాణించే దుస్థితి ఏర్పడుతోంది. అధికారులు వీటిపై దృష్టి సారించి సాయంత్రం, ఉదయం వేళల్లో విద్యార్థులు ఉన్న చోట బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థి సంఘాలతో పోరాటం



సమీప ప్రాంతాల విద్యార్థుల ప్రయాణ సమస్యపై విద్యార్థి సంఘాలతో పోరాటం చేశాం. అనేక సార్లు ఆర్‌టీసీ అధికారులను కలిసి బస్సు పాసులు ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసుల నడపాలని కోరాం. విద్యార్థుల ఉన్న చోట బస్సులు ఆపాలని కోరుతున్నాం.

– టి.రాజా.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రతి సాయంత్రం లిఫ్ట్ ప్రయాణమే..

ఐటీఐ నుంచి భానుగుడి వరకూ వెళ్లాంటే నడిచో లేక ఏవరో ఒకరి బైక్ లిఫ్ట్ ద్వారా చేరుకోవాల్సి వస్తోందని విద్యార్థులు అంటున్నారు. కిలో మీటరు దూరమైనా ఆటో వాళ్లు పదిరూపాయలు వసూలు చేస్తారు. బస్సులు సమయానికి ఆపకపోవడంతో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: కాకినాడలో పురాతన ఆలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంతచెరువు వద్ద నున్న కామాక్షి అమ్మవారి ఆలయంలో రూ. 15 లక్షలతో నిర్మించిన అన్నదాన మండపాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమ గల కామాక్షి అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ అరటికట్ల రాంబాబు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు, బాలాత్రిపుర సుందరి ఆలయకమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలుచేయాలి

కాకినాడ సిటీ: దేశవ్యాప్తంగా ఒకే తరహా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కాకినాడలో గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ అంబేద్కర్ విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తోకల ప్రసాద్, టి అన్నవరం, పప్పు ఆదినారాయణ, అర్జునరావు, శేఖర్, బాబూరావు, భాష తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతి పత్రం అందజేశారు.

మత్స్యకారుల కల నెరవేర్చాం



గ్రామ దేవతల ఆలయ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు. చిత్రంలో సర్పంచ్ చిన్ని, కురసాల సత్యనారాయణ తదితరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూ.50 లక్షలతో గ్రామదేవతల ఆలయ నిర్మాణాలకు ప్రారంభోత్సవం

కాకినాడ రూరల్: సూర్యారావుపేటలోని మత్స్యకారుల కల నేర్చామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గ్రామంలో రూ.50 లక్షలతో 9 గ్రామ దేవతల ఆలయ సముదాయలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ గంగమ్మతల్లి, ఇతర గ్రామ దేవతలను నమ్ముకుని సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు పెద్దమ్మతల్లి, ఇతర గ్రామ దేవలకు మొక్కుకుని వేటకు వెళ్లేందుకు చక్కని ఆలయాలు నిర్మించి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గంగమ్మ దయ మత్స్యకారులకు ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ప్రోత్సాహంతోనే తాను ఇన్ని కార్యక్రమాలు చేయగలుగుతున్నాన్నారు. జగన్నాథస్వామి ఆలయం కోరుతున్నారని నిర్మిస్తున్నామని, మైనార్‌పేటలో ఇద్దరు అమ్మవార్ల ఆలయాలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరాడ చిన్ని, రాజు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జగన్నాథం, మాజీ సర్పంచ్ కోమలి సత్యనారాయణ, సింహద్రి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమే జగన్ ఆకాంక్ష

- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



కొమరగిరిలో స్థలాలను చూసేందుకు వచ్చిన లబ్ధిదారులు

కాకినాడ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ గృహ నిర్మాణం, విద్య, వైద్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన కొమరగిలే అవుట్‌ను ఆయన గురువారం సందర్శించారు.17, 22, 23, 24 డివిజన్ల లబ్ధిదారులను బస్సులలో తీసుకువెళ్లి అక్కడి గృహ నిర్మాణాలను చూపించారు. గత ఎన్నికలకు ముందు పదివేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ దాదాపు 30 వేల మందికి పంపిణీ చేశామన్నారు. ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందని, దీని ద్వారా లబ్ధిదారునికి సంపూర్ణ హక్కు లభిస్తుందన్నారు. పేదల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్న ప్రజలు మరోసారి తమను ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉండగా ఏ ఒక్కరికి గజం స్థలం ఇవ్వని తెలుగుదేశం పాలకులు తాము అధికారంలోకి వస్తే రెండు సెంట్లు స్థలం ఇస్తామని ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని, వీరి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగర పాలకసంస్థ కార్యదర్శి ఎం.యేసుబాబు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామాజిక సేవా వేదిక ఎన్ఎస్ఎస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో వీసీ ప్రసాదరాజు తదితరులు

- ఎంపీ వంగా గీత
- ఉత్సాహంగా యువ సంవాద్–ఇండియా 2047

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సామాజిక సేవ చేయాలనుకునే వారికి ఎన్ఎస్ఎస్ మంచి వేదికగా నిలుస్తుందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో పంచ్‌ప్రాణ్ యువజన సంభాషణ, భారత్‌కే పంచ్‌ప్రాణ్‌–ఏక్ యువ పరిచర్చ అనే నినాదంతో 'యువ సంవాద్–ఇండియా 2047' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఈనాడు ప్రపంచ దేశాలన్నీ భారత దేశం వైపు చూస్తున్నాయని, మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోందన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ మనం సాధించే ప్రగతి భావి తరాలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని, కోవిడ్–19 తర్వాత విద్య, వైద్యం సామాజిక రంగాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. జేఎన్‌టీయూకేలో ఎన్ఎస్ఎస్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండటం సంతోషమని, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గత వారం 420 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించం సంతోషించదగ్గ విషయన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, ఇంక్యుబేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి మాలోతు రమేష్, బీజేపీ నాయకులు గట్టి సత్యనారాయణ, పెద్ది రవికిరణ్ పాల్గొన్నారు.

శెట్టిబలిజల సంపూర్ణ మద్దతు

- శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో భేటీ



ఎమ్మెల్యే ద్వారంపూడికి మద్దతు లేఖను అందిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ

కాకినాడ: రానున్న ఎన్నికల్లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ హామీ ఇచ్చారు. గురువారం ఆయన ఎమ్మెల్యే ద్వారంపూడిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. శెట్టిబలిజ సామాజిక వర్గం తరఫున మద్దతు తెలియజేస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడికి లేఖ అందజేశారు. ఈ సందర్భంగా కుడుపూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చి వారిని అగ్రస్థానంలో నిలిపారన్నారు. రెండు పార్లమెంట్, ఒక రాజ్యసభ, ఎమ్మెల్యే, మంత్రి పదవులు, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులిచ్చి శెట్టి బలిజలకు ఉన్నత స్థానాన్ని కల్పించారన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ఆదరించనంతగా ఆ సామాజిక వర్గానికి పెద్దపీట వేసారన్నారు. పెద్దల సభకు సైతం సీనియర్ నేత పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఎంపిక చేసి తమ సామాజికవర్గంపై ఉన్న అభిమానాన్ని ముఖ్యమంత్రి చాటుకున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కాకినాడ నగరంలో శెట్టి బలిజల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 630 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారన్నారు. తమ సామాజిక వర్గానికి అన్ని విధాలా అండగా ఉంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడికి శెట్టి బలిజ సంఘీయులంతా ఏకతాటిపై నిలిచి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆయనను గెలిపించుకోవడం ద్వారా మరింత ప్రగతి సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రాజకీయంగా శెట్టిబలిజ సామాజిక వర్గం ఆదినుంచి ఎంతో మద్దతుగా నిలుస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని, వీరి అభివృద్ధి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు శెట్టిబలిజ ప్రతినిధులు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండండి

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



శంఖవరం దళితవాడలో కేక్ కట్ చేసి చిన్నారికి తినిపిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

శంఖవరం: దళిత వాడల్లో విద్యార్థులు, యువత వివాదాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లో గురువారం ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమాజ హితం కోసం నిర్వహించే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. దళిత విద్యార్థులు, యువకులు ఉన్నత చదువుల్లో రాణించి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. వివాదాలు, అల్లర్ల జోలికి వెళ్లరాదని సూచించారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుంటే జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. దళిత చిన్నారులు, విద్యార్థులు, యువత నడుమ ఎస్పీ కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సమకూర్చిన రూ.లక్ష విలువైన వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులు, యువకులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్సై ఐ.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు జాతి తాకట్టు



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: పవన్ కల్యాణ్ చంద్రబాబుకు జాతిని తాకట్టు పెట్టారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. కాకినాడ 49వ డివిజన్‌లోని తన నివాసంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పవన్‌కు నాలుగో భార్య నాదెండ్లేనని విమర్శించారు. రాజకీయాలపై కనీస అవగాహన లేని నాయకుడు పవన్ అని, తాడేపల్లి సభలో పవన్ వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ అరుపులు, కేకలతో ఎదుటివారిపై బురద చల్లాలని చూడడం మంచిది కాదన్నారు.

ఓటింగ్‌పై మహిళలకు అవగాహన

తాళ్లరేవు: మండలంలోని పెంకేవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్నికల ఓటింగ్ విధానంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిభావని మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదని ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ఓటింగ్‌పై అవగాహన పెంచుకుని ఉత్తమ ఆశయాలు కలిగిన వ్యక్తులను ఎన్నుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్ ప్రగతిపై కమిషనర్ ఆరా



సైన్స్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఈఓ వెంకటరావు

కాకినాడ: నగరపాలకస సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ సీఈవో, ఎమ్‌డీ జె.వెంకటరావు గురువారం సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. రాజాట్యాంక్ పార్కు ఆవరణలో రూ.15 కోట్లతో ఈసైన్స్ సెంటర్ నిర్మాణమవుతోంది. స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు నిర్మాణ ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాల ఎగ్జిబిషన్ల నిర్వహణ, ఇతర వైజ్ఞానిక అంశాలకోసం ఈ సైన్స్ సెంటర్ నిర్మాణమవుతోందన్నారు. నిర్మాణ పనులు, టెండర్ ప్రక్రియలను మరింత వేగవంతం చేసి త్వరగా వినియోగంలోకి వచ్చేలా ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటరావు, డీఈ రామారావు ఇతర సిబ్బంది ఉన్నారు.

ఐరన్, డీజిల్ చోరీపై కేసు

తొండంగి: మండలంలోని తమ్మయ్యపేట జాతీయ రహదారిపై లారీల నుంచి డీజిల్, ఐరన్ చోరీ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, హైవేపై ఐరన్, డీజిల్ చోరీ జరుగుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో వెళ్లి గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 400 కిలోల ఐరన్‌ను, 250 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పక్కాగా మహా శివరాత్రి ఏర్పాట్లు

పెద్దాపురం: ఈ నెల 8వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు సూచించారు. సామర్లకోట కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ ఈఓ నీలకంఠం అధ్యక్షతన ఉత్సవ ఏర్పాట్లుపై అధికారుల, ప్రజా ప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజప్ప, సుబ్బారావు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ ఎస్.శ్రీధర్ కాకినాడ జీజీహెచ్‌తో పాటు రంగరాయ వైద్య కళాశాలకు అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరించనున్నారు.